# మంత్రార్థము

"ఆవిడ మంచి మనిషి కాదుట: ఊళ్ళో మరెక్కడా ఇళ్లు దొరకవనా...మనం వేరే మరో చోటికి మారుదాం:–" అని. మేము అక్కడ ప్రవేశించిన మరునాడునుచే, వంట యింటిలో నుంచి అలజడి బయలుదేరింది... ఆడవాళ్ళకు యీ సణుగుడు...ఏదో ఒక వంకపెట్టడం మామూలేకదా...అని నేను వినిపించుకోనట్టుగా ఊరుకుంటున్నాను.

ఊరిలో...ఎవరన్నా...అదే మాట:

అయినా మనత్రోవను మనం పోతూంటే...ఎవరు ఏలాగైతేనేం ... ఏకట్టెను నిప్పుఉంటే...

పోనీ, మారుదామా అనుకుంటే...అంత వరుసగా అన్ని వసతులతో ... ఆఫీసుకు దగ్గిరగా ... అద్దె సరసంగా . .. మరొకటి దొరకదు...

ఎలాటి పోరూ పొచ్చెమూ లేదు: ఇంటి యజమాని...ఆ తాతగారు... మాంచి కర్మిష్ఠి...ఓ జోలికీ జొక్యానికీ రాడు... అలా తులసికోట దగ్గిర ముక్కు మూసుకుని కూర్చుని...కునికిపాట్లు పడుతూ...అప్పుడప్పుడు... అమాంతం లేచి నిలుచుని...అర్ఘ్యం విడుస్తూ...

...అవాళ...చోద్యానికి...ఆయనను చూస్తూ అక్కడ ... అవసరమైనంతకన్న...ఓ అరనిమిషం...ఎక్కువ నిలుచున్నందుకే...అంత రాద్ధాంతమైంది...

–నూతి పళ్ళెంమీద కాలు ధనాయించి...స్నానానంతరం...ఒళ్లు తుడుచుకుంటు న్నాను. ఎదుట...ఆయన నాకు అభిముఖుడై...సూర్యుని ఆరాధించుతూన్నాడు...దోసిలి ఒగ్గి...

నేను...చూసినంత సేపు...ఆయనమీదనుంచి చూపుమలపలేదు...గృహిణి...కాదని... పెద్ద పోట్లాట వేసుకుంది. చెపితే నమ్మడం అనేది ఏ కోశానా లేదు...

'నాకు కళ్ళుపోయినా యనుకున్నారా–? అక్కడ నిలుచుని...ఏమిటి ఆవిడను అలా ఎగాదిగా చూడటం...ఎంత తెగించిన మనిషి అయినా...'

–నిజానికి...నా మనసులో అంతవరకూ ఆమె మీద ఎలాటి అభిప్రాయమున్నూ లేదు. తలయెత్తి...తారసిలినప్పుడు... సరిగా చూడనన్నా లేదు... తీరుబడీ లేదు...ఎవరిక్కావాలి? ఉన్న బాదరబందీ చాలకనా? పాల పొంగుమీద ఉన్నప్పుడు... ఆ ఉమ్మసంలో...బోర్లపడినా...ఇప్పుడు మెడకు ఇన్ని లంకెలు తగిలిన తరువాత... తగుదునని మళ్ళా నడుంకడితే...అఘోరించినట్లుంటుంది.

...నేను, నిజం చెప్పినా మా యిల్లాలు సుతరామూ నమ్మనన్నది...నాలో నిజంగా ఏ కొంటెతనమూ లేకపోతే... ఆమె అలా నదురూ బెదురూ లేకుండా, ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తుంటే... ఎందుకు అక్కడే నిలబడాలి?... ఈ ఒక్కనాడే కాదు... యీ నాటకం ఆ యింట అడుగు పెట్టిననాటెనుంచీ గమనించుతూనే

ఉంది... ఎందు కెందుకని ఓపికపట్టి ఊరుకుని...చూసినకొద్దీ శ్రుతిమించేటట్టు కనబడితే ...చివరకు...

–ఈ ధోరణికి నేను ఏమీ అడ్డు తగిలి...పల్లెత్తలేదు: కాని, ఏ పాపమూ ఎరుగకపోయినా...అన్యాయంగా నెత్తికి వచ్చి చుట్టుకుంటూాంది.

–ఇంటికి రావడమంటే నిజంగా భయం వేయడం మొదలు పెట్టింది: పవలల్లా...అక్కడ ఆఫీసులో అయినదానికీ, కానిదానికీ అధికారిచేత అడ్డమయిన మాటలూ పడుతూ...వంచిన తల ఇక ఈ కాస్సేపైనా ఎత్తుకు తిరగవచ్చును కదా. .. అని, ఇక్కడేమో నిక్షేపం కుప్పలన్నీ పారుబోతున్నాయని...ఇటు వచ్చానో లేదో...యిదీ వరుస:

చివరకు, యెలా తయారయిందంటే, మా సరాగం – ఆఁ అంటే తప్పు: ఊఁ అనుకుంటే తప్పు: యెంతైనా మానవ దేహం కనుక, ఓ వేళప్పుడు కాకపోతే ఓ వేళ, ఏమరి...భరించలేక, పొరబాటున నారాయణా అనుకుంటే – అది బూతుమాట. (ఆ ఇల్లాలు పేరు నారాయణమ్మ అని...మా ఇంటావిడ సాధింపుల్లోనే తెలిసింది: అంతకు పూర్వం – పరాయి ఆడదానిపేరు తెలుసుకోవలసిన అగత్యం – నా వంటి నలుగురిలో మెలగనేర్చిన పెద్దమనిషికి యెన్నడూ ఉండదనే సంగతి – బుద్ధి సరిగా తెలియని పసిపిల్లలకు సయితం నికరంగా తెలిసిన విషయం) – సరి:

–దేనికైనా – దరీహద్దూ అంటూ ఉంటుంది: అవునా, కాదా: ఏదో, దైవం తిన్న చూడబట్టి – ఇంతవరకూ దేనికీ దేహీ అనవలసిన అవసరం లేకుండా – ఏదో ఇంత వస్తూంది: సుఖంగా గడిచిపోతూంది. లేకపోతే, మనం 'చదివిన చదువెంత' మన తెలివితేటలు ఏపాటివి? – చదువూ సంధ్యల్లో అన్నివిధాలా నన్ను తలదన్నేవాళ్ళు – అదుంటే ఇదిలేక, అడుగుమాడే స్థితిలో ఉండటం కళ్ళారా చూస్తూ కూడా ఏదో అది వచ్చిన వేళావిశేషాన అయితేనేం – పోనీ నా గీత బాగున్నందువల్ల నైతేనేం – ఇంత ఏదో పరమాత్ముడు ఇచ్చినదాంట్లో – వాహినీగా బ్రతుకుదామంటే – ఉత్త పుణ్యానికి – ఇలాటి గత్తరలు వచ్చిపడుతున్నాయి. అరవై యేళ్ళు వచ్చి, చదువుకోక మన్నుకొట్టుకోనా – అని – ఇప్పుడు నేను – మళ్లా తగుదునమ్మా అనుకుంటూ పదహారేళ్ళ బాలా కుమారుడి నౌతానంటే – నాకు నే నన్నా నమ్మవద్దూ? కలిసి మెలిసి ఇంతకాలంనుంచీ కాపురం చేస్తూ కష్టసుఖాలన్నీ వంటబట్టిపోయిన మనిషే – మా ఇంటావిడకైనా ఆ మాత్రం ఇంగితమంటూ ఉండవద్దూ? అదిగో పులి అని ఎవరూ అనకముందే – ఇదిగో తోకంటూాంటే – అనగా – ఆమె నోటివాక్యం యెటవంటిదో –

వెనుకటికి ఓ కథ ఉన్నది కాదూ? – యెవడో చేతగాని వెధవాయ – యెప్పుడూ పెళ్ళాన్ని పట్టుకు రండా అని తిడుతూంటే ఆ జగజంత – అతడు అన్నంతపనీ కళ్ళ ఎదుటనే చేసి – నీ తపస్సు ఫలించింది; నీవు అన్నమాట అయితీరింది, చూశావా? అన్నదట – ఆ నాధుండు ఇక అవతల, మరినోరు నొక్కుకు ఊరుకున్నాడు: తనచేతే తన నెత్తి అడచిందని – అలాగే–

–వచ్చినవాదు యెలాగూ రానే వచ్చింది – మడిగట్టుకుని కూర్చుంటే – ఇంట్లోనే యీ విధంగా మన్నించుతూన్నప్పుడు – యింతకుమించి ఇక చెడిపోయే

దేమిలేదు కదా? - వ్రతం - యెలాగూ చెడింది - యెవరి లోపమైతేనేం - ఇక ఫలం - ఇందునా అందునా కాకుండా పోవడం యెందుకూ?

అందుకని - ఏ యెండకు ఆ గొడుగే పడుదామనుకున్నాను - మా ఆవిడైనా మాత్రం - ఇందాకా అన్నవాటికి మించి ఇప్పుడు కొత్తవేమి అనలేదుగదా - ఇక పోయేదేముందీ?-

'ఆవిడవంక యెందుకండీ అలా చూస్తారు?'

'యెందుకు చూడకూడదూ?'

'-సిగ్గంటూ ఉండాలి - జన్మ యెత్తగానే సరా?'

'-అదంటూ ఉంటే అప్పుడు మరీ బాగుంటూంది: "కులసతి సిగ్గరి కావలె" అన్నాడు కుందవరం ఘనుడు-'

'అయింది కనుకనే - మీరు ఇన్ని ఆటలు ఆడటం - నేనూ - తెగించి వీధికి యెక్కితే -'

'అప్పుడు - ఆశే మైనా ఉంటే - నీ వంకే చూస్తారు-'

'-మీకు - అభిమానమంటూ లేదూ? - ఎలా పుట్టారు?'

'-అంటూ ఉంది - కాని, ఉండి ఏం లాభం? - నా చేతులో ఏమున్నా ఉన్నది గనుకనా? - మా నాన్న అమ్మవంక చూశాడు - చూడగా చూడగా - తొమ్మిది నెలల పై చిలుకు - యీ నవమన్మథుడు ఊడిపడ్డాడు - అంత వరకే మనకు టూకీగా తెలిసిన విషయం - పోనీ -'

'చాల్లెండీ - ఇక మాట్లాడకండి - మీ మాటలు వింటూంటే ఒళ్ళు ఊం - మండుకొస్తూంది-'

'వస్తే - ఏం లాభం - యెదురుగుండా నేనుండనే ఉంటిని! నా మీదకు విరుచుకుపడి - నన్ను నాలుగూ - చందమామనో నాలుగూ తిట్టి: కోయిలమీద దుమ్మెత్తిపోసి - అలా ఆపసోపాలు పడినా - అది అందమూ చందమూ, అంతాకాని-'

'చదువుకున్న చదువూ - తెలివి తేటలూ ఇందుకు అక్కరకు వస్తూన్నవి - నా గొంతు కోయడానికి -'

'ఇంకా అందాకా రాందే! -'

ఆవిడ చూపులో - నాకు సబబుగా జవాబు చెప్పలేక అసహ్యం కురిపించింది. అది నేను సహించలేక పోయినాను: నేరమెరిగి దండనచేస్తే, అందుకు తలవంచుకుని - అది శిరసావహించే వాడినే - కాని, మంచితనం ఆసరా చూసుకుని నన్ను నిష్కారణంగా - రాచి రంపానపెట్టడం - మళ్ళా, పిల్లల తల్లి! -

పిల్లల తల్లి! - పిల్లలు లేక - ఆవిడ అలా పాపం అటమటించి పోతూంటే - అన్నీ ఉండి - అన్నింటికన్నా కనుసన్నల మెలగేందుకు తేరగా నేను పడి ఉండి -

నిజంగా నాలాటివాడు - సైం - అనాలి కాని - ఆవిడ కళ్ళకు అద్దుకుని, పూవులలో పెట్టి పూజసేయదూ? నీతిగా - ఏకపత్నీ వ్రతమే పాలిస్తూన్నందుకు ఇప్పుడు ఒరిగిందేముంది - ఇంటికి రావడం తడవుగా ...ఇంత రగడ!

తప్పో...ఒప్పో...మనం చేసేది, మన మనసుకు తప్పనిపించినా...అందువల్ల ఇతరుల జన్మ తరించి పోయేటప్పుడు.. .ముందు యీ ముచ్చట తీరిన తరువాత ...

తరువాత...ఎప్పుడో కదా...ఆ లోకంలో ఇందుకు దండన... అప్పటిమాట...అప్పుడు చూసుకోవచ్చును...

నేను...చివరకు...విసుగుతో...నిర్వేదంతో...మా ఆవిడ నోటి వాక్యాన...ఆవిడ అన్నం తపనీ చేసి తీరుదామని... అంతవాడినీ అవుదామని గట్టిగా నిశ్చయించుకున్నాను.

అనుకోవడమే కాని...అదెంతసేపు...అవతల ఆమె...ఆ నోము నోచేందుకే కదా అన్నాళ్ళనుంచీ కాచుకునిఉన్నది! పాపం! అందాకా ఆమె పేరు ఏమిటో అయినా తెలియదు నాకు...తెలియకపోతేనేం...

అవాళ సాయంకాలమే...ఆమె వంక చూసి...అన్నాళ్ళకు, నే నలా చేయడం అదే మొదటిసారి...నిర్భయంగా...ఆమె నా వంక చూస్తూ తలవాకిట నిలుచుని ఉన్నప్పుడు...వీధివెంట వస్తూ, సైగ చేశాను... ఆశ్చర్యంతో, అప్యాయంగా...వెంటనే, 'సరి' అన్నట్టుగా తల ఊగించింది...నేనూ...లేనిసత్తువ తెచ్చుకుని...ఏనుగు నెక్కినట్లుగా సంతోషించాను.

తరువాత, మా అదృష్టము యెలా ఉండేదో...తదనం తర కార్యక్రమ విధాన మేలాగున అయేదో కాని...

అవాంతరంగా – ఆ ఇల్లాలికి, ఆ పూటనే...ముంచుకుపోయినట్లు...చెరగుమాసి... ఊరుకున్నది...

అయితే మాత్రం ఏం, మూడురోజులు మూడు నిమిషాలుగా, కనుమూసి తెరచేటంతలో గడిచిపోతవి. అదీ ఒకందుకు మంచిగానే వచ్చిన దనుకోవచ్చును: ఆమె కోరిక ఇక అవశ్యమూ నెరవేరుతుంది.

అన్నాళ్ళూ...ఆమె నా కంట పడలేదు... అవాంతరం వచ్చినందుకు బిడియపడి, నాకు కనపడకుండా ఉన్నదనుకుంటాను...

అవాళ ఉదయం...నేను నిదుర లేచేటప్పటికే, మా ఇల్లాలు...ఎవరిమీదనో కత్తులు నూరుతూంది: ఆ గొడవ చెవిదగ్గరగా వాగుతూండటంతో...నేను విధిలేక మెలకువ తెప్పించుకుని...లేచి కూర్చుని, మత్తుతో, చిరాకుగా ఏమిటని కసిరాను; ఆవిడ, కళ్ళనీళ్ళతో...

'చూడండి, ఆవిడకు వచ్చిన పోయేకాలం... స్నానం చేసివచ్చి, కిటికీలోనుంచి దొంగతనంగా మన పాపవంక తొంగి చూస్తుంది. నేను చూసేటప్పటికి తత్తరపడుతూ...'టైం ఎంత అయిందండీ అక్కగారూ!' అంటూ పక్కకు తప్పుకున్నది... ఊఁ...నా పిల్లను చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకున్నంత మాత్రాన, అవిడేం పదిమందిని కనిపారెయ్యదు. పైన భగవంతుడు లేడూ? ఏ జన్మలో బొగ్గులపూజ చేసుకుందో...యీ జన్మకు బిడ్డా పాపా అంటూ లేకుండాపోయింది. ఇప్పుడూ ఇలాటి కుత్సితమే అయితే, ఏడేడు పధ్నాలుగు జన్మలకూ ఎప్పటికీ...తన కర్మం అంతే...'

'ఎవరు ...ఆవిడె? అన్నాను, పరాకుగా...'ఇంకెవరున్నారు...మీకు తెలియకనా, యీ నాటకమంతా...అసలు మీరు ఆమెకు లోకువ కాబట్టే కదా...యింతకు తెగించింది, నాబిడ్డ ఎండిపోవాలీ...ఆవిడ కడుపుతూండాలీ? ... ఎవరన్నా వింటే

ముఖాన కల్లాపి జల్లరూ? తెచ్చి పడవేసారు పంచాగ్ని మధ్యాన...ఆహుతి అయిపోయేది నేనూ, నా పిల్లలూ...మీకేం కొత్త పెళ్ళికొడుకు లాగా...'

నిలువెల్లా మండిపడ్డాను... అది కోపమా, ఉత్క్రోశమా?...

నా మీద పూర్తిగా నమ్మకంలేక...ఆమె...అందుకు తోడు... యీ చిట్కా కూడా... వాడిందన్నమాట: నేను ఆమె చేత కొడుకు నెత్తించగలిగినా... లేకపోయినా...అలా తొంగిచూస్తే...మా పాపే ఆమెకడుపున మళ్లాపడి...

నా మగసిరిని...ఆమె అవమానించింది...అలాగని బయటికి అన వీలులేదుకాని...మా ఆవిడకన్నా ఎక్కువగాకోపం తెప్పించుకుని...అయితే రేపే ఖాళీచేసేద్దాం... అన్నాను. ఆమె చోద్యంగా... 'ఆఁ' అన్నది... నామాట మీద నమ్మకం లేక...'అవును... అందరూ అంటూన్నా, ఆమెమంచి మనిషి కాదని ...' మనకేం మనజోలికి రావచ్చిందా... అని...అన్ని వీళ్ళూ ఉండబట్టి... యిక్కడకు వచ్చాముకాని...ఇక...ఇక్కడ ఒక్కక్షణం ఉండద్దు...' అని ఖాయంగా అన్నాను. అన్నాళ్ళకు... మేము ఆ యింట్లోకి వచ్చినన్నాళ్ళకు...అవాళే మా ఆవిడ...కలత లేకుండా నవ్వింది?...

★ ★ ★